సమాచారం

మాణిక్‌రావు ఠాక్రేకు నేతల ఘన స్వాగతం



బండ్లగూడ: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జీ మాణిక్‌రావు ఠాక్రేకు శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సైకాలజిస్ట్ డా.కరీంకు సన్మానం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపోలో ఉత్తమ సేవలు అందించిన కార్మికులకు, సిబ్బందికి బుధవారం అభినంద సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికుల మానసిక ఒత్తిడిని నివారించేందుకు విశిష్ట సేవలందించిన ప్రముఖ మానసిక నిపుణులు, సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఏ.కరీంకు ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ రీజినల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మనోవికాస రంగంలో డాక్టర్ కరీం సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన డ్రైవర్, కండక్టర్లకు నగదు బహుమతులు అందజేశారు.

ప్రత్యేక పూజలు



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లిలోని వెంకన్న గుట్టపై కొలువుదీరిన వెంకటేశ్వర స్వామిని తమిళ సినీ నటుడు యోగి బాబు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ పూజాలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

వార్డు అభివృద్ధికి కృషి



మణికొండ: ప్రజా సమస్యలను పరిష్కరించటంతో పాటు వార్డును అన్ని రంగాలలో అభివృద్ధి చేయటమే ధ్యేయంగా పనిచేస్తున్నామని మణికొండ మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ యాలాల లావణ్య నరేష్ అన్నారు. తన వార్డు శివపురికాలనీలో రూ. 30లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు పరిధిలోని ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. వారు అడిగిన ప్రతి పనిని చేపట్టి ఆదర్శవార్డుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాలాల నరేష్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

అబాకస్‌తో మెదడుకు పదును



ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులు

బండ్లగూడ: అబాకస్ లాంటి మేధో సంబంధిత విద్యతో విద్యార్థుల్లోని ప్రతిభకు మరింత పదును పెట్టవచ్చని స్మార్ట్ కిడ్ లర్నింగ్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత సంజయ్ పేర్కొన్నారు. స్మార్ట్ కిడ్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అబాకస్‌లో రాణిస్తే అంతర్లీనంగా ఉన్న జ్ఞాపకశక్తి, ఏకాగ్రత శక్తి మరింత మెరుగు పడుతుందన్నారు. ముఖ్యంగా గణితంలో విద్యార్థులు రాణించి తద్వారా ఉజ్వల భవిష్యత్తును సంతం చేసుకోవచ్చునన్నారు. తెలంగాణ రాష్ట్రం కిస్మత్‌పూర్ స్మార్ట్ కిడ్ అకాడమి నుంచి 11 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ స్థాయి జూనియర్ విభాగంలో తెలగాణ రాష్ట్రానికి చెందిన పి.అర్జున్ ఆదిత్యన్(2వ తరగతి ద్వితీయ బహుమతి సాధించారు.

బాల కార్మికుడికి విముక్తి

శంషాబాద్ రూరల్: బాలుడుని ఫాంహౌజ్‌లో పనికి పెట్టుకున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని రామంజాపూర్ శివారులో మహమ్మద్ గౌస్ ఖాన్‌కు ఫాంహౌస్ ఉంది. ఇందులో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ సోహెల్ షఫీ(13)ని పనికి పెట్టుకున్నాడు. బుధవారం శంషాబాద్ డివిజన్ స్పెషల్ టీం అక్కడకు వెళ్లగా షఫీ పశువులను మేపుతున్నాడు. అతన్ని విచారించి వివరాలు సేకరించారు. ఇతను గత ఆరు నెలలుగా ఇక్కడ పని చేస్తున్నట్లు గుర్తించారు. బాలుడిని పునరావాస గృహానికి తరలించి, ఫాంహౌజ్ యజమానిపై కేసు నమోదు చేశారు.

పన్ను వసూళ్లకు రంగం సిద్ధం..

- పన్ను టార్గెట్‌కు గడువు 78 రోజులే..
- మార్చి వరకు పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్..



బండ్లగూడ: మరో మూడు నెలలతో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆస్తిపన్ను వసూలుపై మున్సిపల్ అధికారులు దృష్టికేంద్రీకరించారు. కార్పొరేషన్‌కు పన్నుల రూపంలో ఆదాయం భారీగా సమకూరుతుంది.

◆ గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అప్పుడు 28,200కు పైగా నివాసాలకు అసెస్‌మెంటు చేసి ఉండగా, కొంతమంది సకాలంలో పన్ను చెల్లించకపోవడంతో అపరాద రుసుము రూపంలో కలిపి మొత్తం ఆదాయం 10.61 కోట్లు ఆదాయం వచ్చింది.

2022–23 ఆర్థిక సంవత్సరానికి 21.50 కోట్ల టార్గెట్..

ఈ ఆర్థిక సంవత్సరం 2022–23కి సంబంధించి 31,548 నివాససాలకు అసెస్‌మెంటు చేయగా, రూ. 21.50 కోట్ల టార్గెట్ నిర్దేశించగా, ఇప్పటి వరకు 10.17 కోట్ల రూపాయలు వసూలయ్యాయి. మిగితా రావలసిన రూ.11.33 కోట్లు మార్చి నెలాకరు వరకు వసూలు చేసే పనిలో పడ్డ బిల్ కలెక్టర్‌లు, కార్పొరేషన్ సిబ్బంది.

పన్నులు కట్టేందుకు ముందుకు వస్తున్న జనాలు..

గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఈ ప్రాంతంలో కేవలం రూ.లక్షల్లో పన్ను వసూలు అయ్యేది. పన్నులు కట్టడానికి ఆసక్తి చూపని ప్రజలు కార్పొరేషన్ ఏర్పడిన అనంతరం నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు అసెస్‌మెంట్ పూర్తి చేయడంతో పాటు ఇంటి నెంబర్లు కేటాయించి పన్నులు విధించడంతో కార్పొరేషన్‌కు ఆదాయం భారీగా పెరుగుతోంది. ఇప్పుడు ప్రజల్లో గణనీయమైన మార్పు కన్పిస్తోంది.

ఆదాయం భారీగా పెరిగే అవకాశం..

ఇక్కడ పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు మరిన్ని వచ్చే అవకాశం ఉన్నందున కార్పొరేషన్‌కు ఆదాయం భారీగా పెరిగే అవకాశం ఉంది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిస్మత్‌పూర్, దర్గా ఖలీజ్ ఖాన్, హిమాయత్ సాగర్, హైదర్ షాకోట్, బండ్లగూడజాగీర్, పీరంచెరువు, గంధంగూడ, బైరాగి గూడ తదితర ప్రాంతాలు కలిసి కార్పొరేషన్‌గా ఏర్పాడింది. ప్రస్తుతం 31,548 నివాసగృహాలు ఉండగా 200 కాలనీలు ఏర్పడ్డాయి. జనాభా 1.50 లక్షల వరకు ఉంటుదని అంచనా.

పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్..

78 రోజులు గడువు ఉండటంతో ప్రతిరోజు మానిటరింగ్ చేస్తూ వందశాతం పన్నులు వసూలు చేయాలనే లక్ష్యంతో కార్పొరేషన్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ప్రతి రోజు పన్ను చెల్లించని ఇళ్లకు వెళ్లి కలెక్షన్లు చేస్తూ, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలలో పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టి, ఆన్‌లైన్ ద్వారా, మీ సేవ కేంద్రాల ద్వారా చెల్లించాలని తెలుపుతూ టార్గెట్‌కు చేరుకునేందుకు బిల్ కలెక్టర్‌లు, కార్పొరేషన్ సిబ్బంది కృషి చేస్తున్నారు.

ఆదాయం పెంచడమే లక్ష్యంగా



మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయం పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. వచ్చే ఆదాయంతో కార్పొరేషన్ అభివృద్ధికి, ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం, మరి కొన్ని కోట్ల అభివృద్ధి పనులకు గాను ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– వేణుగోపాల్‌రెడ్డి కమిషనర్ బండ్లగూడ జాగీర్



టీపీయూఎస్ కేలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు



నాన్ టీచింగ్ స్టాఫ్ కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కేలెండర్ ఆవిష్కరణ

శంషాబాద్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కె. హనుమంతురావు డిమాండ్ చేశారు. టీపీయూఎస్ 2023 కేలెండర్ బుధవారం మండల వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి రాంరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. ఆదర్శ పాఠశాలల్లో హిందీ, పీజీటీలను నియమించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీపీయూఎస్ తన పోరాటాలను కొనసాగిస్తోందన్నారు. జిల్లా అధ్యక్షుడు కె. కాశి, గౌరవ అధ్యక్షుడు సుధీర్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో..

రాజేంద్రనగర్: కొండా లక్ష్మణ్ ఆర్టికల్చర్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. గజ్వేల్ ములుగు కొండా లక్ష్మణ్ ఆర్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నీరజ చేతుల మీదుగా క్యాలెండర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాన్ టీచింగ్ అధ్యక్షులు పోతరాజు యాదయ్య, డాక్టర్ భగవాన్, రిజిస్ట్రార్ కిరణ్, డాక్టర్ చిన్ననాయక్, చెంచు రామయ్య, కార్యదర్శి టి.కుమార్, రజనీకాంత్, కె.మురళీకృష్ణ, రామకృష్ణ, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి

మణికొండ: వాసవి క్లబ్ కపుల్స్ మణికొండ ఆధ్వర్యంలో బుధవారం అలకాపూర్ టౌన్‌షిప్ నేతాజీ పార్కులో నిర్వహించిన ముగ్గుల పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రకరకాల ముగ్గులు వేసి పోటీలు పడ్డారు. ఉత్తమ నాలుగు ముగ్గులను కమిటీ నాయకులు ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీలను స్థానిక కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి ప్రారంభించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలు మనకు సంతోషాలను పంచేందుకు వస్తాయని, వాటిని ఇలా అందరితో కలిసి జరుపుకుంటే మరింత ఆనందం కలుగుతుందన్నారు. వాసవి క్లబ్ కపుల్స్ జిల్లా కోఆర్డినేటర్ ఈశ్వర్‌ప్రసాద్, జోనల్ చైర్‌పర్సన్ జి.నవీన్, అధ్యక్షురాలు కె.నిరీష, కార్యదర్శి వి. వంశీకృష్ణ, కోశాధికారి కె.రామ్‌సురేష్, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రేపు ముగ్గుల పోటీలు



మాట్లాడుతున్న రంగారెడ్డి(అర్బన్) జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్

రాజేంద్రనగర్: మన సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ప్రతీకగా నిలుస్తుందని అత్తాపూర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్, రంగారెడ్డి(అర్బన్) జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకోని ఈ నెల 13వ తేదీన రాజేంద్రనగర్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం మైదానంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నేటితరం మహిళలకు మన సంప్రదాయం, సంస్కృతి అలవర్చుకోవడానికి ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై ముగ్గుల పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఉత్తమ ముగ్గులకు బహుమతులు అందజేస్తామన్నారు. సమావేశంలో చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ అమరేందర్, రాజేంద్రనగర్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు గడీల పద్మావతి, జిల్లా ఉపాధ్యక్షురాలు వీణాసేవక్, జిల్లా బేటి బచావో బేటి పడావో కన్వీనర్ ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



నూతన సంవత్సర కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: విద్యార్థులు ఉపాధ్యాయుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే విద్యార్థులు అన్ని విధాల అభివృద్ధి సాధిస్తారని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఎస్‌టియూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పడమటి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో టేబుల్ క్యాలెండర్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందరూ పేద విద్యార్థులను తమ పిల్లలుగా భావించి విద్యాబోధన చేయాలన్నారు. ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. తరగతి గదిలో విద్యార్థులకు బోధించే పాఠాలను నేర్పరిగా బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్‌టీఎఫ్ ఉపాధ్యక్షులు భాస్కర్, పరమేష్, మండల అధ్యక్షులు వెంకటయ్య, కార్యదర్శి బాలకృష్ణ, గోవర్ధన్‌రెడ్డి, మండల కోశాధికారి రాంమోహన్, మహిళా ఉపాధ్యక్షురాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

యువతి అదృశ్యం



నాగలక్ష్మి (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి కనిపించకుండాపోయిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వడ్ల సుజాత కుటుంబ సభ్యులతో కలిసి మైలార్‌దేవ్‌పల్లిలోని హనుమాన్ దేవాలయం ప్రాంతంలో ఉంటున్నారు. సుజాతకు ఒక కుమారుడు, కుమార్తే నాగలక్ష్మి(19) సంతానం. ఈ నెల 8వ తేదీన నాగలక్ష్మి కిరాణా షాపుకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేశారు. ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా బ్లాస్టింగ్ పనులు

- కంప్రెషర్ ట్రాక్టర్, మందు గుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్న పోలీసులు

శంషాబాద్ రూరల్: బండరాళ్లను తొలగించడానికి అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేయడంతో పాటు కంప్రెషర్, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మదన్‌పల్లిలో ప్రహ్లాద్ అనే వ్యక్తి భూమిలో అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం అక్కడకు వెళ్లారు. అత్తాపూర్‌కు చెందిన ఉపేందర్, పాల్మాకుల వాసి శ్రీను అనే ఇద్దరు అక్కడ పనులు చేస్తున్నారు. పోలీసులను చూసి ఉపేందర్ పారిపోయాడు. బ్లాస్టింగ్ కోసం తెచ్చిన కంప్రెషర్ ట్రాక్టర్, 15 డిటోనేటర్లు, 25 గెలిటిన్ స్టోన్స్, మైగ్రేషన్ బాక్సు, బైండింగ్ తీగను స్వాధీనం చేసుకున్నారు. శ్రీనును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

లోన్ పేరుతో రూ.2,09,480 స్వాహా

శంషాబాద్ రూరల్: రుణం కావాలా.. అంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్ల మాయమాటలతో ఓ యువకుడి నుంచి రూ.2,09,480 స్వాహా చేశారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మున్సిపాలిటి పరిధిలోని గొల్లపల్లికి చెందిన బి.దేవేందర్ మెకానిక్ పని చేస్తున్నాడు. ఈ నెల 2న తన ఫోన్‌కు ఓ నెంబరు నుంచి కాల్ రాగా.. బజాజ్ ఫైనాన్స్ నుంచి మాట్లాడుతున్నాను.. లోన్స్ కావాలా అని అడిగాడు. దీంతో రూ.3లక్షల లోను మంజూరు కావడానికి రిజిస్ట్రేషన్ చార్జీ కింద రూ.2,500 చెల్లించమనడంతో పేటీఎమ్ చేశాడు. తర్వాత ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ పేరుతో రకరకాలుగా చెబుతూ అతని నుంచి రూ.2,09,480 కాజేశారు. ఈ డబ్బును తిరిగి ఇస్తామని చెప్పి మోసం చేస్తూ కాలయాపన చేశారు. బుధవారం బాధితుడు శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పాత నేరస్తుడి అరెస్టు

మణికొండ: తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడటం, చోరీ చేసిన నగలను విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలుచేసే పాత నేరస్తుడిని నార్సింగి పోలీసులు అరెస్టు చేశారు. మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన ముద్ద ఏసోబు నగరంలో పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చోరీలకు పాల్పడటంతోఅతనిపై 38 కేసులు నమోదయ్యాయి. బుధవారం నార్సింగిలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించటంతో విచారించగా పాత నేరస్తుడిగా నిర్ధారణ అయ్యిందన్నారు. అతను పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినా అతనిలో మార్పు లేదన్నారు. అతని నుంచి దొంగతనానికి ఉపయోగించే ఓ ఐరన్ రాడ్, రెండు స్క్రూ డ్రైవర్లు, రెండు కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని పీడీ యాక్ట్ నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

- రైల్వేగేట్ దాటుతుండగా ఢీకొన్న రైలు
- ఒకరి దుర్మరణం

మైలార్‌దేవ్‌పల్లి: రైలు ఢీకొన్న ఘటనలో ఓ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ ఫరీదుద్దీన్ (40) మైలార్‌దేవ్‌పల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న మొగల్స్ కాలనీలో నివసిస్తున్నాడు. ఫరీదుద్దీన్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మంగళవారం రాత్రి రైల్వేగేట్ దాటుతుండగా ఒక్కసారిగా వచ్చిన రైలు ఫరుద్దుదీన్‌ను ఢీకోట్టింది. ఈ ఘటనలో ముక్కలు ముక్కలుగా ఫరుద్దుదీన్ మృతదేహం పడి ఉంది. గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న రైల్వేబ్రిడ్జి పనులు నిర్లక్ష్యం కారణంగానే ఫరుద్దుదీన్ మృతి చెందాడని స్థానికులు ఆందోళనకు దిగారు. కాచిగూడ రైల్వే పోలీసులు మృతదేహ భాగాలను స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువైపులా రోడ్డు విస్తరణ చేపట్టాలి



మంత్రి సబితారెడ్డిని కలిసిన సాయిరాంనగర్ కాలనీ వాసులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రం మీదుగా నార్సింగి వరకు చేపడుతున్న రోడ్డు వెడల్పు పనులను ఒకవైపే కాకుండా రెండు వైపులా చేయాలని సాయిరాం కాలనీ వాసులు మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిలను కోరారు. బుధవారం మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు మాల్యాద్రినాయుడు ఆధ్వర్యంలో వారిని కలిసి వినతిపత్రాలను అందజేశారు. మణికొండ మున్సిపాలిటీ నుంచి అబిడ్స్, కోఠి, ఎంజీబీఎస్‌ల మీదుగా చార్మినార్ వరకు బస్‌లను నడిపితే స్థానికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని వారికి వివరించారు. అమీర్‌పేట మీదుగా సికింద్రాబాద్ వరకు బస్‌లను నడపాలని కోరారు. దాంతో వారు స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారని మాల్యాద్రినాయుడు తెలిపారు.

21నుంచి నార్సింగి మల్లన్న ఉత్సవాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న అశోక్‌యాదవ్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని మల్లన్న కల్యాణ మహోత్సవాలను ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తామని దేవాలయ కమిటీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్ తెలిపారు. బుధవారం దేవాలయం ఆవరణలో ఉత్సవాల ఆహ్వాన పత్రికతో పాటు దేవాలయ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ తేదీన గంగతెప్ప తేవటంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 22వ తేదీ గణపతి పూజ, అగ్నిగుండాలు, మల్లిఖార్జునస్వామి కేతకి, బ్రమరాంభ సమేతంగా కల్యాణం, సొడమ్మ బోనాలు జరుగుతాయన్నారు. 23వ తేదీన నాగవల్లి, 24వ తేదీన ఎల్లమ్మ కల్యాణం, బోనాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ సిఐ నాగేందర్‌బాబు

రాజేంద్రనగర్: విద్యార్థులు అన్ని రంగాల్లో పాలు పంచుకున్నప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని రాజేంద్రనగర్ సిఐ నాగేందర్‌బాబు అన్నారు. స్వామి వివేకానంద ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాపర్తి రాకేష్‌గౌడ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. రాజేంద్రనగర్‌లోని వెంకటేశ్వర దేవాలయం మైదానంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకోని నిర్వహిస్తున్న ఈ క్రికెట్ టోర్నమెంట్ పోటీలకు బుధవారం రాజేంద్రనగర్ సిఐ నాగేందర్‌బాబు, బీజేపీ రంగారెడ్డి జిల్లా నాయకులు వై.శ్రీధర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. బొక్క బాల్‌రెడ్డి, మూల శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, జి.బాబు రావు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన సీబీఐటీ విద్యార్థి



శ్రీతేజను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మణికొండ: ఎస్‌హెచ్‌ఎల్ సంస్థ జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ కోడింగ్ ఈవెంట్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం, జాతీయ స్థాయిలో 5వ స్థానంలో నిలిచిన సీబీఐటీ విద్యార్థి శ్రీతేజను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్ట్ పి.రవీందర్‌రెడ్డి సన్మానించి అభినందించారు. ఈ ఈవెంట్‌లో 600 సంస్థల నుంచి 10 వేల మందికిపైగా పాల్గొనగా అందులో శ్రీతేజ రాణించటం అభినందనీయమన్నారు అతను కళాశాలలో ప్రతి ఒక్కరికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. ఎస్‌హెచ్‌ఎల్ క్యాంపస్ సొల్యూషన్స్ రీజినల్ మేనేజర్ చంద్రహాస్ మాట్లాడుతూ యువకులలో ఉన్న ప్రతిభను తమ సంస్థ గుర్తించి ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్‌లు వై.రమాదేవి, పి. సురేష్, డాక్టర్ ఎస్‌ఎల్‌ఎస్ రెడ్డి, డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ ప్రతిమ, డాక్టర్ జీఎస్‌ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో పందుల బెడద



మైలార్‌దేవ్‌పల్లి: హౌజింగ్ బోర్డు కాలనీలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ హౌజింగ్ బోర్డు కాలనీలో గత కొన్ని రోజులుగా డంప్ చేసిన చెత్త చెదారాలు స్థానికులకు ఇబ్బంది కలిగిస్తోంది. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రపరచడంలో అధికారులు విఫలమవుతున్న నేపథ్యంలోనే ఇలాంటి జీవులు సంచరిస్తు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తుంటాయి. తడి, పొడి చెత్తలను వేరు వేరుగా చేస్తూ జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన చెత్త సేకరణ కార్మికులకే చెత్తను ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ ప్రకటించిన ప్రజల్లో ఎలాంటి చైతన్యం లేదు. గుంపులు గుంపులుగా పందులు నివసిస్తు వాతావరణాన్ని కలుషితం చేయడంతో పందుల ద్వారా వ్యాప్తి చెందే రోగాలతో ప్రజల జీవన శైలి దెబ్బతింటుంది అని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ వెస్టెండ్ కాలనీలోని ఉమామహేశ్వర ఆలయ ప్రాంగణంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి గొల్కొండ జిల్లా సహ సంయోజిక దశక పద్మ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. వివేకానంద పాఠశాల ప్రిన్సిపల్ అర్చన, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.